క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు 3 నెలల నుంచి ప్రతి ఆదివారం పబ్లిక్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం 40 మంది విద్యార్థులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కరప జెడ్పీ హైస్కూల్ మ్యాథ్స్ ఉపాధ్యాయుడు టేకుమూడి శ్రీనివాసరావు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పరీక్షలు ఏ విధంగా రాయాలో అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామకృష్ణమూర్తి, మాథ్స్ ఉపాధ్యాయులు తెలగాని తిలక్‌బాబు, పద్మావతి గెస్ట్ అధ్యాపకుడు టేకుమూడి శ్రీనివాసరావుకు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చు చేయరూ...



ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాజులూరు: మొగలిపాలెంలో దుర్గాదేవి ఆలయం వద్ద మంచినీటి బావిని ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. గతంలో శీల రోడ్డులో కాలువ గట్టున విద్యుత్ స్తంభానికి ఉండే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో సిబ్బంది ఏడేళ్ల క్రితం గ్రామం మధ్యలో ఈ ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. స్థానికులు బావిలో నుంచి నీటిని తోడుకునే సమయంలో తడిచిన బకెట్ తాడు పొరపాటున బావి పైనున్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలితే ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

రామచంద్రపురం రూరల్: రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రామచంద్రపురం, రాయవరం మండలాల్లో ఖాళీగా ఉన్న 7 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ వజ్రపు వరాహలక్ష్మి విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ-7లో ఎస్టీ, వెల్ల-1లో బీసీ-బీ, తోటపేట-1లో బీసీ-ఏ, రాయవరం మండలం మాచవరం-10లో ఓసీ, వెంటూరు-1లో బీసీ-బీ, కూర్మాపురం-2లో ఓసీ, వి.సావరం-1లో బీసీ-బీ కేటగిరీల్లో నియామకాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 31 లోపుగా అర్హత ధ్రువీకరణ పత్రాలతో రాయవరం ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

అంతా అంకెల గారడీ

కాజులూరు: రాజధాని నిర్మాణం పేరుతో నాడు టీడీపీ నాయకులు అంకెల గారడీ చేశారని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వర్రావు అన్నారు. ఆదివారం కాజులూరు శివారు చాకిరేవుమెరకలో సంఘం ప్రధాన కార్యదర్శి నరాల శ్రీను అధ్యక్షతన జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో విశ్వేశ్వర్రావు మాట్లాడారు. గత టీడీపీ పాలనలో నిధులన్నీ రాజధానిలో భవన నిర్మాణాలకే ఖర్చు చేస్తూన్నామంటూ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోకుండా వదిలేశారన్నారు. ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి కేంద్రం నుంచి తెచ్చిన ప్యాకేజీతో 30 నామమాత్రపు భవనాలు, 30 అసంపూర్తి భవనాలు నిర్మించి నిధులు స్వాహా చేసిన టీడీపీ నాయకులు మూడు రాజధానుల ఏర్పాటు ద్వారా పరిపాలన వికేంద్రీకరణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని అర్థం చేసుకోకుండా అడ్డుపడేందుకు చూస్తున్నారన్నారు. వాస్తవానికి అమరావతిలో రాజధాని అని చెప్పుకునేలా ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. మండల బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దెయ్యాల సత్తిబాబు, ట్రెజరర్ కట్టా సత్యనారాయణ, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: గొల్లపాలెం, కుయ్యేరు రహదారిలో బందనపూడి ఊటచెరువు సెంటరు వద్ద ఆదివారం స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఆనాల ధనరాజు తన స్కూటర్‌పై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. బందనపూడి శివారు ఊటచెరువు సెంటరు వద్దకు వచ్చేసరికి స్కూటర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతులో పడ్డాడు. ఈ సంఘటనలో ధనరాజు గాయాలపాలవడంతో స్థానికులు గమనించి, గొల్లపాలెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

ఎంపీటీసీ కుటుంబ సభ్యులకు పరామర్శ

రాయవరం: మామ వియోగంతో బాధపడుతున్న మాచవరం ఎంపీటీసీ పలివెల శోభనసతీష్‌ను ఎంపీపీ నౌడు వెంకటరమణ ఆదివారం పరామర్శించారు. ఎంపీటీసీ శోభన సతీష్ మామగారు సత్యం(53) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపీటీసీ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, సానుభూతి తెలిపారు. వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెకంటరెడ్డి, నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆడపడుచులకు ఆసరా

- మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీకి సర్వం సిద్ధం
- 25న ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- నియోజకవర్గంలో 5,425 డ్వాక్రా సంఘాలకు లబ్ధి



మండపేట: వైఎస్సార్ ఆసరా మూడో విడత విడుదలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే గత రెండేళ్ల లోను రెండు విడతల్లో నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాలకు రూ.89.5 కోట్లు రుణాలు మాఫీఅయ్యాయి. తాజాగా మూడో విడత ఆసరా సాయం విడుదలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25వ తేదీన లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలు తీసుకున్న పొదుపు రుణాల సొమ్మును నాలుగు విడతల్లో వారి చేతికే అందిస్తానన్న ఎన్నికల వాగ్దానాన్ని సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఏడాదికే అమలులోకి తెచ్చారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకు లింకేజీ ద్వారా డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో చెల్లించేందుకు నిర్ణయించారు. రుణాలు పొందిన సంఘాలను అప్పట్లోనే మెప్మా, వెలుగు సిబ్బంది గుర్తించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 6,406 డ్వాక్రా సంఘాలకు గాను ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు వైఎస్సార్ ఆసరా పథకానికి 5,425 సంఘాలు అర్హత పొందాయి. ఆయా సంఘాల పరిధిలో 54,359 మంది సభ్యులకు రుణమాఫీగా మొత్తం రూ.179 కోట్లు లబ్ధి చేకూరుతోంది. నాలుగు విడతలకు గాను గత రెండేళ్లలో రెండు విడతలుగా రూ.89.5 కోట్లు మొత్తాన్ని ప్రభుత్వం డ్వాక్రా సంఘాల అకౌంట్లకు జమ చేసింది. మూడో విడత ఆసరా చెల్లించేందుకు లబ్ధిదారుల బయోమెట్రిక్‌ల సేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈనెల 25వ తేదీన సీఎం లాంఛనంగా ప్రారంభించనుండగా తర్వాత నియోజకవర్గంలోని పట్టణ, మండల కేంద్రాల్లో పది రోజుల పాటు వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను నిర్వహించి డ్వాక్రా సంఘాల అకౌంట్లకు మాఫీ సొమ్ములను ప్రభుత్వం జమ చేయనుంది.

మండలం	మొత్తం సంఘాలు	అర్హత పొందినవి	సభ్యులు	రుణమాఫీ మొత్తం
మండపేట అర్బన్	1098	919	9382	రూ. 30.35 కోట్లు
మండపేట రూరల్	1912	1566	15625	రూ. 47.14 కోట్లు
రాయవరం	1632	1479	14710	రూ. 54.81 కోట్లు
కపిలేశ్వరపురం	1764	1461	14642	రూ. 46.70 కోట్లు

ఏర్పాట్లు చేస్తున్నాం



మూడో విడత వైఎస్సార్ ఆసరా సాయం విడుదలకు సంబంధించి మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే లబ్ధి పొందిన సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మండలాల వారీగా సమావేశాల నిర్వహణకు షెడ్యూల్ రూపొందిస్తున్నాం.

– ఐ.రాజు, ఎంపీడీఓ, మండపేట

మొత్తం రుణం మాఫీ



ఒక్కొక్కరికి రూ.70,000 చొప్పున ఎన్నికలకు ముందు నెలలోనే మా గ్రూపు సభ్యులం రూ.7 లక్షలు రుణం తీసుకున్నాం. జగనన్న సీఎం అయిన వెంటనే రుణమాఫీ చేయడంతో ఆ మొత్తం మాఫీ అయ్యింది. గత రెండు విడతల్లో నాకు రూ.35,000 లబ్ధి చేకూరింది.

– షేక్ చినబుజ్జి, లబ్ధిదారురాలు, మండపేట

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కె.గంగవరం: అద్దంపల్లి గ్రామానికి చెందిన కర్రి సుబ్బారాయుడు ఇటీవల భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ పడి వెన్నుముక, కాళ్లు పూర్తిగా దెబ్బతిని మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కాపు ఐక్యత సంఘం సభ్యులు బాధితుడిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆదివారం రూ.55,500 ఆర్థిక సాయాన్ని కర్రి సుబ్బారాయుడు కుటుంబానికి నాయకులు మాగాపు అమ్మిరాజు, నామా వెంకన్న బాబు, ఆళ్ల బుజ్జి తదితరులు అందించారు. దీంతో పాటు రూ.5 వేలు విలువ చేసే కిరాణా, కురగాయలు, బియ్యాన్ని అందించారు. అల్లం రామకృష్ణ, కంచర్ల చక్రి, నక్క భీమశంకరం, తాతేలు, మురళీకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శభాష్‌పేటకు చెందిన దివ్యాంగులు వందన, ఆనందకుమార్‌లకు అమలాపురానికి చెందిన మాతారమాభాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసరాలను ఆదివారం అందజేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులు పెంటపాటి శ్రీను, పద్మ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటే సుబ్రహ్మణ్యం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చికిత్స

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన జి.శ్రీనివాస్, భవాని దంపతులకు మూగ, వినికిడి సమస్యలతో పుట్టిన ఇద్దరు కవల పిల్లలున్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకు అధిక ఖర్చు అవుతోంది. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైజాగ్‌లో స్థిరపడిన పారిశ్రామికవేత్త గన్నమని ఆనందరావు కుమారుడు మురళీకృష్ణ ఆ చిన్నారులకు చికిత్స చేయించి, వినికిడి పరికరాలను సమకూర్చారు. మురళీకృష్ణకు సర్పంచ్ సాకా శ్రీనివాస్, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా జనార్దనస్వామి కల్యాణం

ఆలమూరు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితులు పెద్దింటి వెంకటరమణ ఆచార్యులు, పెద్దింటి విశ్వనాథశాస్త్రి, అంగర సింగరాచార్యులు, అంగర సత్యనారాయణచార్యులు మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని అనురాధ గాత్ర కచేరి విశేషంగా ఆకట్టుకుంది. వంటిపల్లి విశ్వనాథం, వెత్సా నెహ్రూ, సుబ్బరాజు సహకారంతో ఆలయ కమిటీ ఈ మహోత్సవాలను నిర్వహించింది.

నూకాలమ్మకు వెండి వడ్డాణం సమర్పణ

మామిడికుదురు: మామిడికుదురు గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ వారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఉండ్రు కృష్ణారావు కుటుంబ సభ్యులు వెండి వడ్డాణాన్ని ఆదివారం సమర్పించారు. జల్లి కృష్ణకుమారి, తోటే సదా సాయి, ఉండ్రు వాణి శ్రీ, యార్లు మహాలక్ష్మీ, గంటి రాధ, గెద్దాడ యాష్టకాయ, గెద్దాడ ఆనంద్‌కుమార్, భోము ఇందిరా ప్రియాదర్శిని, ఉండ్రు శ్రీ రామారావు, ఉండ్రు హేమాంజలి రూ.64 వేల విలువైన 700 గ్రాముల వెండి వడ్డాణాన్ని అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు వడ్డాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన శ్రీరామ సప్తాహం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో రామాలయం వద్ద నిర్వహించిన తొమ్మిదో శ్రీరామ సప్తాహ మహోత్సవం ఆదివారం ముగిసింది. జిల్లాలోని ప్రముఖ భజన బృందాలు వారం రోజుల నుంచి భక్తి కీర్తనలను ఆలపించడంతో గ్రామం అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన మహిళా భక్త భజన కళాకారులు ఆలపించిన రామాయణంలోని పలు ఘట్టాలకు చెందిన పద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అంగరకు చెందిన వెంకన్న కాపు బృందం ఉదయం, రాత్రి వేళల్లో నిర్వహించిన పవళింపు సేవ, మేల్కొలుపు సేవ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. శ్రీరామ సప్తాహ మహోత్సవంలో పీటలపై కూర్చుని పూజలు నిర్వహించిన దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పూజా ద్రవ్యాలను స్థానిక పెద్దకాలువలో నిమజ్జనం చేసింది.

కొత్తపూల ఉత్సవాల ముగింపు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో పక్షం రోజుల నుంచి జరుగుతున్న కొత్తపూల ఉత్సవాలకు దేవదాయశాఖ ముగింపు పలికింది. స్థానిక ముఖ మంటపం ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించిన కొత్తపూల ఉత్సవాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చారు. మోదుగపూలను అలంకరించిన గరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు, తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. సోమవారం నుంచి జరుగనున్న నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా తీర్థంలో పలు రకాల దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు పూర్తయ్యింది.

సూర్యారావుపేటలో ఆకట్టుకున్న చిన జాగరణ

సూర్యారావుపేటలో చింతలూరు నూకాంబిక అమ్మవారి చిన జాగరణ వైభవంగా జరిగింది. ఆలయ ఆసాదుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నూతన ఆవిష్కరణలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన

మండపేట: వైద్య విధానంలో ఎప్పటికప్పుడు వచ్చే నూతన ఆవిష్కరణలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి అన్నారు. మండపేట పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం స్థానిక టౌన్ హాలులో ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణార్జునచౌదరి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్య పరిరక్షణకు పీఎంపీల సేవలు అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన వీస్టార్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు సింగంశెట్టి వెంకట చైతన్య మాట్లాడుతూ మూత్రపిండాలు, మూత్రాశయ వ్యాధులు, ప్రోస్టేట్ గ్రంథిపై అవగాహన కల్పించారు. డాక్టర్ వంశీ, డాక్టర్ బీటీ చౌదరి ఆధునిక పరిజ్ఞానం గురించి వివరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, సంఘ నాయకులు బళ్లా శ్రీనివాసరావు, మారిశెట్టి సత్యనారాయణ, వీకే రాజు, సూరంపూడి వీరభద్రరావు, బీవీ రమణ, వీకే రాజు, ఏడిద లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాయం కోసం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న సత్యనారాయణ

కె.గంగవరం: అముజూరు గ్రామానికి చెందిన పాము సత్యనారాయణ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. కాకినాడలోని ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన సత్యనారాయణ గత రెండేళ్ల క్రితం రెండు కిడ్నీలు పాడైపోవడంతో ఆయన సోదరి వరలక్ష్మి కిడ్నీ ఇవ్వడానికి ముందుకు రావడంతో అప్పట్లో దాతల సహాయంతో ఆపరేషన్ చేయించారు. ఆరోగ్యం బాగుందన్న సమయంలో కొత్తగా ప్రబలుతున్న వైరస్ కారణంగా రెండు వారాల క్రితం నుంచి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడి ఆసుపత్రిలో చేరాడు. అయితే వైద్యులు ఊపిరితుత్తులకు పూర్తిగా ఇన్ఫెక్షన్ కావడంతో ఆ కిడ్నీ కూడా పని చేయడం లేదని చెప్పారు. దీంతో ఒక్కసారిగా మళ్లీ కుటుంబంలో ఆవేదన చోటుచేసుకుంది. చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబాన్ని పోషించుకునే సత్యనారాయణకు అనారోగ్యం రావడంతో ఉన్నతందా అమ్మి కాకినాడలోని ట్రస్ట్ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ప్రస్తుతం సత్యనారాయణ ఐసీయులో ఉన్నారు. పూర్తి స్థాయి వైద్యానికి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పారని భార్య పద్మ, పిల్లలు చెబుతున్నారు. దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని భార్య పద్మ, ఇద్దరు పిల్లలు విజ్ఞప్తి చేస్తున్నారు. మంచి మనసుతో ఎవరైన ముందుకు వచ్చి 9848542811కు సంప్రదించి సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- గ్రామ సచివాలయాల్లో శిబిరాల ఏర్పాటు
- ప్రజలకు తప్పనున్న ఇబ్బందులు



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ పాలనను గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకు చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధార్ సేవలనూ అందుబాటులో ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా రామచంద్రపురం డివిజన్ పరిధిలో రామచంద్రపురం రూరల్, రామచంద్రపురం అర్బన్, రాయవరం, మండపేట రూరల్, మండపేట అర్బన్, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 20, 21, 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ నమోదులో జరిగిన పొరబాట్లు సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పించారు.

గ్రామాల వారీగా వివరాలిలా..

మండపేట రూరల్ ఏడిద, వై.సీతానగరం, తాపేశ్వరం, అర్తమూరు, వెలగతోడు, పాలతోడు, ఇప్పనపాడు, కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప, వల్లూరు, అంగర, వడ్లమూరు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామచంద్రపురం మండలం ఉండూరు, వెంకటాయపాలెం, రాయవరం మండలం వెదురుపాక, చెల్లూరు, సోమేశ్వరం, పసలపూడి, మాచవరం, వెంటూరు, లొల్ల, కె.గంగవరం మండలం కూళ్ల, పామర్రు, సత్యవాడ, పాణింగిపల్లి, కోటిపల్లి, పేకేరు, రామచంద్రపురం అర్బన్ వైఎస్సార్ నగర్, కుమ్మర్ల వీధి, కొత్తూరు, మండపేట అర్బన్ హరిజనపేట, గొల్లగుంట, సైదిపేట, మేదరపేట, ధర్మగుండం, వల్లూరి వారి వీధి సచివాలయల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సచివాలయాల్లోనే..

గ్రామ సచివాయల వద్ద ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆ రోజుల్లో ఆధార్‌లో నమోదైన తప్పులు సరిదిద్దుకుంటే తరువాత వ్యయ ప్రయాసలు తప్పుతాయి.

– ఎ.శాంతి, డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, రామచంద్రపురం

కలాం స్ఫూర్తితో మెలగాలి

ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు భవనం ప్రారంభం



ట్రస్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న షరీఫ్, పృథ్వీరాజ్, రాజుబాబు తదితరులు

మండపేట: భారతరత్న, మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఆయన పేరిట ట్రస్టును నెలకొల్పి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. స్థానిక సత్యశ్రీ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్టు కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, టీడీపీ నేత వి.సాయికుమార్, బీజేపీ నేత కోన సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్‌కలాం స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు మెలగాలన్నారు. మానవ పుట్టుక ఎంతో ఉత్తమమైనదని, సేవా కార్యక్రమాలతో జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. ట్రస్టు అభ్యున్నతికి తమ పూర్తి సహకారాలు అందిస్తామని ప్రముఖులు పేర్కొన్నారు. ట్రస్టు కార్యాలయం నిర్మాణానికి పాటుపడిన ట్రస్టు చైర్మన్ షేక్ మౌలానాను ప్రముఖులు ప్రశంసించారు. అనంతరం ఎనిమిది మంది మహిళలకు కుట్టుమెషీన్లు, ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన విద్యార్థి కిల్లంపల్లి అరుణ్ కుమార్ 1.5 లక్షల గుండుసూదులతో రూపొందించిన అబ్దుల్‌కలాం చిత్ర పటాన్ని ఆవిష్కరించారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యినపకోళ్ల సత్యనారాయణ, ట్రస్టు వైస్‌చైర్మన్ షేక్ ఇబ్రహీం, సయ్యద్‌రబ్బానీ, షేక్ బాదుల్లా, ఎండీ అతిక్, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

ఇళ్ల బాట పట్టిన అధ్యాపకులు

- కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే ప్రయత్నం
- విద్యా సంవత్సరానికి ముందే గ్రామాల్లో ప్రచారం



రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాలలో విద్యార్థుల చేరిక కోసం ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేరికకు అధ్యాపకులు ఇళ్ల బాట పట్టారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తమ ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించకున్నా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇది గత కొన్నేళ్లుగా జరుగుతునే ఉంది. అయితే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కాస్త ముందుగా ప్రయత్నం మొదలుపెట్టారు.

ఉన్నత పాఠశాలలో కళాశాల ఏర్పాటు

రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇప్పటి వరకూ గ్రామానికి దూరంగా ఉండడంతో చేరికలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఇంటర్మీడిమెట్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల ప్రభుత్వ కళాశాలను స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషి మేరకు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాల గ్రామంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అధిక సంఖ్యలో చేరికలు ఉంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోజనాలు వివరిస్తూ..

రాబోయే విద్యా సంవత్సరంపై అధ్యాపకులు ఆశలు పెట్టుకున్నారు. కళాశాల గ్రామంలోకి రావడంతో విద్యార్థుల చేరికలు పెరిగే అవకాశముంది. కళాశాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంతో అధ్యాపకులు కూడా నూతనోత్సాహంతో పని చేస్తున్నారు. కళాశాల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్లి పదో తరగతి విద్యార్థులను రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అంగీకారాన్ని తీసుకుంటున్నారు.

విద్యార్థుల సంఖ్య పైనే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, వి.సావరం, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, అనపర్తి మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారు. ఇదిలా ఉంటే విద్యార్థుల సంఖ్యపైనే కళాశాల మనుగడ ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అధ్యాపకుల భవిష్యత్ కూడా విద్యార్థుల సంఖ్య పైనే ఆధారపడి ఉండడంతో అధ్యాపకులు విద్యార్థుల కోసం ఇంటిబాట పట్టారు.

ఈ ఏడాదిలో పరిస్థితి..

ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులున్నాయి. ప్రస్తుతం ఎంపీసీ-08, బైపీసీ-04, సీఈసీ-10, హెచ్‌ఈసీ గ్రూపులో 06 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ-16, బైపీసీ-11, సీఈసీ-15, హెచ్‌ఈసీ గ్రూపులో 14 మంది విద్యనభ్యసించారు. ఫస్టియర్, సెకండియర్ నాలుగు గ్రూపులకు కలిపి 160 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా, కేవలం 84 మంది అడ్మిషన్లు జరిగాయి.

చేరికలు పెంచుతాం



కళాశాలలో విద్యార్థుల చేరికను పెంచేందుకు అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అన్ని సబ్జెక్టు అధ్యాపకులు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో సంఖ్య కచ్చితంగా పెరుగుతుందని ఆశిస్తున్నాం. రహదారి చెంతనే ఉండడం, బస్ సౌకర్యం ఉండడంతో విద్యార్థులు అధికంగా చేరే అవకాశముంది. కళాశాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం.

– దారపు వీర వెంకట నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయవరం